
సాక్షి
తిరుపతి
సోమవారం । 5 । జూన్‌ । 2023



పర్యావరణహితం..శ్రీసిటీ సొంతం

శ్రీసిటీ.. భారీ పరిశ్రమలే కాదు.. అక్కడ వాతావరణం కూడా సందర్శకులను ఆకట్టుకుంటోంది. -8లో



తెప్పోత్సవం..పరిపూర్ణం

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. -8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	41	28
చిత్తూరు	39	27
తిరుమల	36	23
గూడూరు	42	29
నగరి	41	28

న్యూస్‌రీల్‌

రద్దీ..రద్దీ


ప్రయాణికులతో కిక్కిరిసిన తిరుపతి రైల్వే స్టేషన్‌

తిరుపతి అర్బన్‌: వేసవి సెలవులు ముగింపు దశకు చేరుకోవడంతో ఆర్టీసీతోపాటు రైల్వే స్టేషన్లలో రద్దీ కొనసాగుతోంది. ఆర్టీసీ సర్వీసుల్లో రోజూ ఆరు లక్షల మంది ప్రయాణికులు జిల్లా నుంచి జర్నీ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో రోజువారీ ఆదాయం రూ.1.6 కోట్లుగా ఉంది. మరోవైపు రైల్వే మార్గాల్లోనూ రద్దీ కొనసాగుతోంది. జిల్లాలో ప్రధానంగా తిరుపతి, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట, సూళ్లూరుపేట రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ఆ మేరకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు.

ఖరీఫ్‌కు 4,413 మెట్రిక్‌ టన్నుల ఎరువులు


ఎల్‌ఎల్‌ఏఎం తాయారమ్మ

తిరుపతి అర్బన్‌: ఈ ఏడాది ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభానికి ముందే ఎరువులు సిద్ధం చేయడంతోపాటు వైఎస్సార్‌ రైతు భరోసా కేంద్రాలకు పంపిణీ చేసినట్టు ఏపీ మార్క్‌ఫెడ్‌ జిల్లా మేనేజర్‌ ఎల్‌ఎల్‌ఏఎం తాయారమ్మ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ వ్యవసాయశాఖ అధికారుల ప్రతిపాదనల మేరకు ఏపీ మార్క్‌ఫెడ్‌ నుంచి ఎరువులు అందించినట్లు స్పష్టం చేశారు. ప్రధానంగా డీఏపీ 506, యూరియా 3,585, ఎంపీకే(కాంప్లెక్స్‌)315, పొటాష్‌ 7 మెట్రిక్‌ టన్నులు ఆర్బీకేలకు పంపినట్లు వెల్లడించారు. అంతేకాకుండా మార్క్‌ఫెడ్‌లో డీఏపీ 150, యూరియా 3,650, ఎంపీకే(కాంప్లెక్స్‌) 165, పొటాష్‌ 35 మెట్రిక్‌ టన్నులు నిల్వలున్నాయని తెలిపారు. రైతుల అవసరాన్ని బట్టి ఎరువులను సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

తిరుపతి అర్బన్‌: కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం సోమవారం యథావిధిగా నిర్వహించనున్నట్టు కలెక్టర్‌ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు తెలియజేయవచ్చని సూచించారు.

పాలిసెట్‌ కౌన్సెలింగ్‌కు 146 మంది హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్‌ : తిరుపతి కపిలతీర్థం రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలలో ఆదివారం 92,001 ర్యాంకు నుంచి 1,08,000 ర్యాంకు వరకు పాలిసెట్‌ కౌన్సెలింగ్‌ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌కు 146 మంది విద్యార్థులు హాజరై తమ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్‌, పాలిసెట్‌ కో–ఆర్డినేటర్‌ డాక్టర్‌ వై.ద్వారకనాథ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా చివరి రోజైన సోమవారం 1,08,001ర్యాంకు నుంచి చివరి ర్యాంకు విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలన చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్‌ వెరిఫికేషన్‌ ఆఫీసర్‌ సీహెచ్‌.శైలజ, అసిస్టెంట్‌ కో–ఆర్డినేటర్‌ ఎస్‌.సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎస్‌కేఆర్‌ కళాశాలలో జాబ్‌ మేళా

గూడూరు: స్థానిక ఎస్‌కేఆర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐసీఐసీఐ బ్యాంకు వారు సోమవారం ఉదయం 10 గంటలకు జాబ్‌ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్‌ డాక్టర్‌ పీ వెంకటేశ్వర్లు ఆదివారం ఓ ప్రకనలో తెలిపారు. ఈ జాబ్‌ మేళాలో పాల్గొన దలచిన యువతీయువకులు ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన వారు అర్హులని, 25 ఏళ్ల లోపు వారై ఉండాలని స్పష్టం చేశారు. వేతనం రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఉంటుందని వెల్లడించారు. వివరాలకు హెచ్‌ఆర్‌ మేనేజర్‌ 9566177753 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.


ఆత్మీయ సమ్మేళనం


సమావేశమైన అధికారులు

శ్రీకాళహస్తి: 1983–85 సంవత్సరం పూర్వ గ్రామాభివృద్ధి అధికారుల ఆత్మీయ సమావేశం 40 సంవత్సరాల తరువాత ఆదివారం పట్టణంలోని విస్తరణ శిక్షణ కేంద్రంలో జరిగింది. ఈ సమ్మేళనంలో సుమారు 30 మంది పూర్వ శిక్షణ పొందిన అధికారులు పాల్గొన్నారు. తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఇందులో చిత్తూరు, నెల్లూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాకు చెందిన వారు ఉన్నారు.

మిషన్‌ సూర్యచంద్ర





అంతర్జాతీయంగా భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) సత్తా చాటుతోంది.. గ్రహాంతర ప్రయోగాల్లో దేశప్రతిష్టను ఇనుమడింపజేస్తోంది.. ఇప్పటికే చంద్రయాన్‌.. మంగళయాన్‌ పేరుతో చంద్రుడు.. అంగారకుడిపై పరిశోధనలు చేపట్టింది. అదే స్ఫూర్తితో మరోపర్యాయం చంద్రమండలం స్థితిగతులను క్షుణ్ణంగా అధ్యయం చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది.. అలాగే సూర్యునిపై వాతావరణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించేందుకు ప్రత్యేక ప్రయోగానికి సన్నాహాలు చేస్తోంది.. ఎల్‌వీఎం–3.. పీఎస్‌ఎల్వీ సీ56 రాకెట్ల ద్వారా విశిష్ట ఉపగ్రహాలను రోదసీలోకి పంపించేందుకు సన్నద్ధమవుతోంది.. ప్రపంచవ్యాప్తంగా భారత కీర్తిపతాకను అప్రతిహతంగా ఎగురవేసేందుకు అడుగులు వేస్తోంది.

- చంద్రుడిపై పరిశోధనకు చంద్రయాన్‌–3
- సూర్యుడిపై పరిశోధనకు ఆదిత్య–ఎల్‌1
- జూలై.. ఆగస్టులోనే రెండు ప్రయోగాలు
- సన్నాహాలు చేస్తున్న ఇస్రో

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ మరోసారి ప్రత్యేక ప్రయోగాలకు శ్రీకారం చుట్టింది. సూర్యచంద్రులపై పరిశోధనలు చేయడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఏడాది జులై, ఆగస్టులోనే రెండు గ్రహాంతర ప్రయోగాలు విజయవంతం చేసేందుకు సర్వం సిద్ధం చేస్తోంది. జులై 12న ఎల్‌వీఎం–3 రాకెట్‌ ద్వారా 3,900 కిలోల బరువు కలిగిన చంద్రయాన్‌–3 ఉపగ్రహాన్ని ప్రయోగించడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు శ్రీహరికోట షార్‌లోని రెండో వెహికల్‌ అసెంబ్లింగ్‌ బిల్డింగ్‌లో ఎల్‌వీఎం–3 రాకెట్‌ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే మే 28వ తేదీన చంద్రయాన్‌–3 మిషన్‌ కూడా బెంగళూరు నుంచి చేరుకుంది. షార్‌లోని క్లీన్‌రూంలో దీనికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. గతంలో చంద్రయాన్‌–2 మిషన్‌లో భాగంగా ఆర్బిటర్‌ ద్వారా ల్యాండర్‌ను పంపించారు. ల్యాండర్‌ చంద్రుడి ఉపరితలంపై దిగిన తర్వాత రోవర్‌ను విడుదల చేసే విధంగా డిజైన్‌ చేశారు. చంద్రయాన్‌–3 ప్రయోగంలో ప్రొపల్సన్‌ మాడ్యూల్‌ ద్వారా ల్యాండర్‌ను చంద్రుడి వైపునకు పంపించబోతున్నారు. ల్యాండర్‌ నుంచి రోవర్‌ బయటకు వచ్చి చంద్రుడి దక్షిణ ధ్రువంపై పరిశోధనలు చేసేలా రూపకల్పన చేశారు. చంద్రుడి దక్షిణధ్రువంలో మెత్తగా వుండే స్థలాన్ని ఎంపిక చేసి అక్కడ దించాలని నిర్ణయించారు. ప్రయోగాన్ని విజయవంతం చేసేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు పకడ్బందీగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చంద్రయాన్‌–3 ప్రాజెక్టుకి సుమారు రూ.615 కోట్లు వెచ్చిస్తున్నారు.

పీఎస్‌ఎల్వీ ద్వారా ఆదిత్య ఎల్‌–1

సూర్యుడిపై పరిశోధనలను చేసేందుకు 1,412 కిలోల ఆదిత్య ఎల్‌–1 ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నారు. పీఎస్‌ఎల్‌వీ సీ56 రాకెట్‌ ద్వారా ఈ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి ప్రవేశపెట్టనున్నారు. షార్‌లోని మొదటి ప్రయోగవేదికకు సంబంధించి పీఎస్‌ఎల్వీ ఇంటిగ్రేషన్‌ ఫెసిలిటీ భవనంలో రాకెట్‌ అనుసంధానం పనులు చేస్తున్నారు. ఈ ప్రయోగాన్ని జులై ఆఖరుకి కానీ, ఆగస్టు మొదటి వారంలో కానీ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆదిత్య ఎల్‌–1 ద్వారా సౌరగోళంలో గాలులు, జ్వాలలు, రేణువుల తీరుతెన్నులపై పరిశోధనలు చేయనున్నారు.. సౌర తుఫాన్‌ సమయంలో వెలువడే రేణువుల వల్ల భూమిపై సమాచార వ్యవస్థకు ఏర్పడే అవరోధాలు, కాంతి మండలం (ఫొటో స్పియర్‌), వర్ణ మండలం (క్రోమోస్పియర్‌)పై అధ్యయనం చేసి సమాచారాన్ని సేకరించేందుకు సన్నద్ధమవుతున్నారు. సౌర వాతావరణాన్ని పరిశోధించేందుకు కరోనాగ్రఫీ ప్రయోగమని కూడా అంటారు. భూమికి 1.5 మిలియన్‌ కిలోమీటర్ల దూరంలో వున్న సూర్య వ్యవస్థ లాంగ్రేజ్‌ పాయింట్‌–1 (ఎల్‌–1) కక్ష్యలోకి ఆదిత్య ఎల్‌–1 ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టి పరిశోధనలు చేపట్టనున్నారు. విద్యుదయస్కాంత, కణ, మాగ్నెటిక్‌ ఫీల్డ్‌ డిటెక్టర్లను ఉపయోగించి ఫొటోస్పియర్‌, క్రోమో స్పియర్‌ సూర్యుని బయట పొరలను పరిశీలించేందుకు ఉపగ్రహంలో ఏడు పేలోడ్స్‌ను అమరుస్తున్నారు.సూర్యుడిపై పరిశోధనల్లో ఇది చారిత్రక ప్రయోగమవుతుందని ఇస్రో శాస్త్రవేత్తలు వెల్లడిస్తున్నారు. ఇందుకోసం సుమారు రూ.378 కోట్లు వెచ్చిస్తున్నారు.

సత్తా చాటిన ఇస్రో

గ్రహాంతర ప్రయోగాల్లో ఇస్రో ఇప్పటికే సత్తా చాటింది. గతంలో తొలి ప్రయత్నంలోనే విజయం సాధించింది. 2008లో చంద్రయాన్‌–1, 2019లో చంద్రయాన్‌–2, 2013లో మంగళ్‌యాన్‌–1 పేరుతో విశేష పరిశోధనలు చేపట్టింది. మూడు గ్రహాంతర ప్రయోగాలు చేసిన ఇస్రో ఇప్పుడు ఏకంగా సూర్యుడిపైకి ఆదిత్య–ఎల్‌1 ఉపగ్రహాన్ని, చంద్రుడిపై పరిశోధనలు చేయడానికి చంద్రయాన్‌–3 అనే రెండు ప్రయోగాలు చేయడానికి సిద్ధమవుతోంది. చంద్రయాన్‌–1 ప్రయోగంతో లూనార్‌ ఆర్బిట్‌లో చంద్రుడి చుట్టూ ఉపగ్రహాన్ని తిప్పి చంద్రుడికి రెండోవైపు ఏముందో పరిశోధనలు చేసింది. అప్పుడే చంద్రుడిపై నీరు ఉన్నట్లు కనిపెట్టింది. చంద్రయాన్‌–2 పేరుతో మరో అడుగు ముందుకేసి చంద్రుడిపై ల్యాండర్‌, రోవర్‌ను దించేందుకు యత్నించింది. అయితే చివరి రెండు నిముషాల్లో సాంకేతిక లోపం తలెత్తడంతో ల్యాండర్‌ చంద్రుడి ఉపరితలాన్ని ఢీకొనడంతో ప్రయోగం విఫలమైంది. ఈ పర్యాయం విజయం సాధించేందుకు చంద్రయాన్‌–3లో భాగంగా మరోమారు ల్యాండర్‌, రోవర్‌ను చంద్రుడిపై దించేందుకు సంకల్పించింది. ఈ రెండు ప్రయోగాలు సక్సెస్‌ అయితే ఇస్రో ఖ్యాతి అంతర్జాతీయంగా మరింత ఇనుమడిస్తుందనడంతో సందేహం లేదు.

నేడు పర్యావరణ పరిరక్షణపై పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్‌ : తిరుపతి ఎస్వీయూ క్యాంపస్‌ హైస్కూల్‌లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ శేఖర్‌ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవాల్లో భాగంగా ఏపీ శాస్త్ర, సాంకేతిక మండలి (అప్‌కాస్ట్‌) ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ అంశంపై స్పాట్‌ పోస్టర్‌ పెయింటింగ్‌, వ్యాసరచన, ప్రముఖ శాస్త్రవేత్తలపై వక్తృత్వ పోటీలను జిల్లా స్థాయిలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 3నుంచి 9వ తరగతి విద్యార్థులు పోటీలకు హాజరుకావచ్చని సూచించారు. పెయింటింగ్‌ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు అన్ని వస్తువులను తెచ్చుకోవాలిని కోరారు. విజేతలకు సైన్స్‌ పుస్తకాలు, ప్రశంసాపత్రాలు, సర్టిఫికెట్లు అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు అప్‌కాస్ట్‌ జిల్లా కో–ఆర్డినేటర్‌ కె.ధనంజయసారథి 99859 39029, డీఏసి ఎస్‌.కోదండపాణిని 99593 05376 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ముగిసిన జ్యేష్టాభిషేకం



తిరుమల : తిరుమల శ్రీవారి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జ్యేష్టాభిషేకం ఆదివారం వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా మలయప్ప స్వామివారు స్వర్ణ కవచం ధరించి భక్తులను కటాక్షించారు.

అలా బయటపడ్డారు

- తిరుపతి ప్రయాణికులు క్షేమం
- సీట్‌ రిజర్వేషన్‌ కోసం లాంగ్‌ జర్నీ టికెట్‌
- రాజమండ్రి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళంలోనే దిగేశారు
- ఒడిశా వరకు ఒక్కరూ వెళ్లలేదని రైల్వే అధికారుల వెల్లడి

తిరుపతి అర్బన్‌: ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతి దేశవిదేశాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. రైళ్లు.. బస్సులు విపరీతమైన రద్దీతో నడుస్తుంటాయి. ముఖ్యంగా రైళ్లలో తక్కువ దూరం ప్రయాణం చేసేవారికి సీట్‌ రిజర్వేషన్‌ దొరకడం అంత సులభం కాదు. చాంతాడంత వెయిటింగ్‌ లిస్ట్‌ ఉంటుంది. ఈ క్రమంలో చాలామంది బెర్త్‌ రిజర్వేషన్‌ కన్ఫర్మ్‌ అయ్యేందుకు లాంగ్‌ జర్నీకి టికెట్లు తీసుకుంటుంటారు. తమ గమ్యం రాగానే మధ్యలో దిగేస్తుంటారు. ఇదే ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదం నుంచి తిరుపతి జిల్లాలో హౌరా ఎక్స్‌ప్రెస్‌ ఎక్కిన వారిని కాపాడింది. ఈ విషయం గుర్తించడానికి రైల్వే అధికారులకు మూడు రోజులు పట్టింది. ఆదివారం ఉదయం 11 గంటలకు దీనిపై పూర్తి స్పష్టత వచ్చింది. ప్రయాణికులంతా క్షేమంగా ఉండడంతో రైల్వే అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

తిరుపతి ప్రయాణికులు సురక్షితం

తిరుపతి మీదుగా వెళ్లిన హౌరా ఎక్స్‌ప్రెస్‌లో తిరుపతి జిల్లా నుంచి 40 మంది ప్రయాణికులు జర్నీ చేశారు.అయితే ఒడిశా రాష్ట్రం బాలాసోర్‌ సమీపంలోని బహంగ్‌బాజర్‌ రైల్వే స్టేషన్‌ వద్ద ప్రమాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన ప్రాంతానికి అవతలి స్టేషన్‌ హౌరాకు తిరుపతి నుంచి 8మంది,రేణిగుంట నుంచి 8మంది,గూడూరు నుంచి ఇద్దరు. మొత్తంగా 18 మంది టికెట్‌ తీసుకున్నారు. ప్రమాదం జరిగిన స్టేషన్‌కు ముందు స్టేషన్‌ బాలాసోర్‌కు తిరుపతి నుంచి 10 మంది టికెట్‌ తీసుకున్నారు.అయితే వీరంతా ఏపీలోని వివిధ ప్రాంతాల్లో ముందే దిగేసినవారే.


తిరుపతి రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌

టికెట్‌ తీసుకుంది వీరే..

హౌరా స్టేషన్‌కు తిరుపతి నుంచి టికెట్‌ తీసుకున్న వారిలో అజయ్‌ కేఆర్‌,కుమారి ప్రయాంక, కమలాదేవి, ఎం.కుమార్‌, అనురాగ కుమార్‌, భూపేంద్ర, యానియా,సోలారింగ్‌ ఉన్నారు. గూడూరు నుంచి హౌరాకు టిక్కెట్‌ తీసుకున్న వారిలో ఎస్‌కే దాస్‌, దూలాల్‌ ఉన్నారు,రేణిగుంట నుంచి హౌరాకు టిక్కెట్‌ తీసుకున్న వారిలో చంద్రమణి,శాల్వి,తేజా, లీలావతి,రాజా,డీఎస్‌ సాయి,సూచిట్‌,సుభామిత్ర ఉన్నారు.మొత్తంగా అంతా సురక్షితంగా ఉండడంతో రైల్వే అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

ప్రయాణికులు క్షేమం



తిరుపతి నుంచి ఒడిశాకు ప్రయాణం చేసిన వారు సురక్షితంగా ఉన్నారు. టికెట్లు ఒడిశా ప్రాంతానికి తీసుకున్నప్పటికి వారు మన రాష్ట్రంలోనే వివిధ ప్రాంతాల్లో దిగేశారు. దీంతో వారి సమాచారం తెలుసుకోవడం కష్టంగా మారింది. ఏమైనా రైలు ప్రమాద ఘటన దురదృష్టకరం.
– సత్యనారాయణ, తిరుపతి రైల్వే స్టేషన్‌ డైరెక్టర్‌

గరుడవాహనంపై గోవిందుడి అభయం


గరుడ వాహనంపై ఊరేగుతున్న గోవిందుడు

వడమాలపేట : మండలంలోని అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదవరోజు ప్రసన్న వేంకటేశ్వరస్వామి గరుడవాహనంపై విహరించారు. ఉదయం స్వామి వారిని సుప్రభాతం సేవతో మేల్కొల్పి విశ్వరూప దర్శనం, శుద్ధి, కొలువు, తోమాలసేవ, అర్చన, మొదటిగంట హించారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. శ్రీవారిని వాహన మండపంలోకి వేంచేపు చేశారు. స్వామి వారి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఉత్సవ మూర్తిని పల్లకీపై మోహినీ అవతారంలో కొలువుదీర్చి వేదోక్తంగా దీపధూపనైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామి వారు మాడవీధుల్లో పల్లకీపై ఊరేగారు. సాయంత్రం శుద్ధి, రాత్రి కైంకర్యములు నిర్వహించారు. సాయంత్రం 5 నుంచి నుండి 6 వరకు ఊంజల్‌సేవ వేడుకగా నిర్వహించారు. అనంతరం శ్రీవారిని వాహనమండపంలోకి వేంచేపు చేసి సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 7 గంటల నుంచి గరుడ సేవ ఆరంభమైంది. గరుడ వాహనంపై గోవిందుడు ఊరేగుతుంటే భక్తుల గోవింద నామస్మరణతో మాడవీధులు మారుమ్రోగాయి. వాహన సేవ అనంతరం స్వామి వారికి సల్లింపు కార్యక్రమం నిర్వహించి, ఏకాంత సేవ నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరులు రాంప్రసాద్‌రెడ్డి, లక్ష్మి దంపతులు గరుడవాహన సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్‌, టెంపుల్‌ సూపరింటెండెంట్‌ శ్రీవాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్‌ శివకుమార్‌, అర్చకులు సూర్యకుమారాచార్యులు, తిప్పాచార్యులు పాల్గొన్నారు.

హోరాహోరీగా చంద్రగిరి ఐపీఎల్‌


ఇరంగారిపల్లె జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతిని అందిస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, టోర్నమెంట్‌ కార్యనిర్వాహక చైర్మన్‌ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్‌ : చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చంద్రగిరి ఐపీఎల్‌ క్రికెట్‌ టోర్నీ తుది దశకు చేరుకుంది. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఇప్పటికే ఐదు మండలాలు ఫైనల్స్‌కు చేరుకోగా తిరుపతి రూరల్‌ మండలం మాత్రం సెమీ ఫైనల్స్‌ చేరుకుంది.

పాకాల విజేతగా ఇరంగారిపల్లె

పాకాల మండలం నుంచి హిట్‌ మెన్‌ ఎలెవన్స్‌ (ఇరంగారిపల్లె), మున్నా ఎలెవన్స్‌ (పాకాల) జట్లు ఫైనల్స్‌ లో తలపడ్డాయి. 15 ఓవర్లకు పాకాల జట్టు 70 పరుగులు సాధించింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఇరంగారిపల్లె జట్టు 9 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు నష్టపోయి 71 పరుగులు సాధించి విజేతగా నిలిచింది. అలాగే దామల చెరువు హైస్కూల్‌ గేటు జట్టు 3వ స్థానం, జీజీపీ ఎలెవన్స్‌ జట్టు 4వ స్థానంలో నిలిచాయి. బెస్ట్‌ బ్యాట్స్‌మెన్‌గా మనోజ్‌, బెస్ట్‌ బౌలర్‌గా సద్దాం, బెస్ట్‌ ఆల్‌రౌండర్‌గా జయరామ్‌ బహుమతులు సాధించారు.

ముఖ్య అతిథిగా టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

చంద్రగిరి ఐపీఎల్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌లో పాకాల మండలం విజేతగా నిలిచిన ఇరంగారిపల్లె, రన్నర్స్‌ గా నిలిచిన పాకాల జట్టుకు టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌ రెడ్డి, టోర్నమెంట్‌ కార్యానిర్వాహక కమిటీ చైర్మన్‌ చెవిరెడ్డి మోహిత్‌ రెడ్డి ట్రోఫీలను అందించారు. అలాగే ఇరంగారిపల్లి జట్టుకు రూ.లక్ష , ద్వితీయ స్థానంలో నిలిచిన పాకాల జట్టుకు రూ.75వేలు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన దామలచెరువు జట్టుకు రూ.50వేలు, గానుగపెంట జట్టుకు రూ. 25వేలు చొప్పున మొత్తం రూ.2.50 లక్షలు నగదు బహుమతులను చెవిరెడ్డి మోహిత్‌ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌ రెడ్డి అందజేశారు.

సెమీఫైనల్స్‌లో ఓడిన జట్ల మధ్య పోటీలు

చిన్నగొట్టిగల్లు, రామచంద్రాపురం, చంద్రగిరి మండల స్థాయి పోటీల్లో సెమీఫైనల్స్‌లో ఓడిన జట్ల మధ్య మూడు, నాలుగో స్థానాల కోసం ఆదివారం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చిన్నగొట్టిగల్లు సీఎస్‌కె జట్టు 3వ స్థానం, ఎగువూరుకు చెందిన బాబీ ఎలెవన్స్‌ 4వ స్థానంలో నిలిచాయి. రామచంద్రాపురం మండలం నుంచి కొత్త వేపకుప్పం నుంచి వీపీకే ఎలెవన్స్‌, నడవలూరు ఎలవన్స్‌ జట్లు మూడు, నాలుగు స్థానాలకు చేరుకున్నాయి.తొండవాడ గ్లాడియేటర్స్‌ జట్టు మూడో స్థానం, రాయలపురం నుంచి రాయల్‌ ఎలెవన్స్‌ జట్టు నాలుగో స్థానం దక్కించుకుంది.

తిరుపతి రూరల్‌ మండలం పెరుమాళ్లపల్లి, దుర్గ సముద్రం జట్ల మధ్య క్వార్టర్స్‌ ఫైనల్స్‌లో పెరుమాళ్లపల్లె జట్టు గెలిచింది.


సరదాగా క్రికెట్‌ ఆడుతున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి


రన్నర్స్‌గా నిలిచిన పాకాల జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి అందిస్తున్న ధర్మారెడ్డి, మోహిత్‌రెడ్డి

ఆదిపురుష్‌ ప్రీ రిలీజ్‌కు భారీ భద్రత


మైదానాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైమ్‌: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ తారకరామ క్రీడా మైదానంలో ఈనెల 6 తేదీన జరగనున్న ఆదిపురుష్‌ ప్రీ రిలీజ్‌కు భారీ భద్రత ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఈవెంట్‌ జరిగే క్రీడామైదానాన్ని ఆయన పరిశీలించారు. రెండుమూడు లక్షల జనాభా వచ్చే అవకాశం ఉండడంతో సుమారు వెయ్యిమందితో భద్రతను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

రాహుకేతు మండపాల తనిఖీ


పూజలను పరిశీలిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని రాహుకేతు మండపాలను ఆదివారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న సదుపాయాలను భక్తులను అడిగి తెలుసుకున్నారు. భక్తులు సంతృప్తి చెందే విధంగా పూజలు నిర్వహించాలని పూజారులకు సూచించారు. ఆలయంలోకి దళారీలు రాకుండా కట్టడి చేశారు. అడ్డదారిలో వెళ్లేవారిని నియంత్రించారు. ఆయన వెంట ఆలయ అధికారులు ఉన్నారు.

ఘనంగా అర్జున తపస్సు


తపస్సు మానుపై అర్జున వేషధారి

పాకాల : మండలంలోని దామలచెరువు పంచాయతీ పోలిశెట్టివారిపల్లె భారతం మిట్ట వద్ద ఆదివారం సాయంత్రం అర్జున తపస్సును ఘనంగా నిర్వహించారు. అర్జునుడిగా జనార్దన్, శివుడిగా చెన్నకృష్ణ, పార్వతీదేవిగా రమేష్ వేషాలను ధరించి ఆకట్టుకున్నారు. అర్జున వేషధారి తపస్సు మానును అధిరోహించి అరటి, నిమ్మ, విబూది పండ్లు విసిరారు. పెద్ద సంఖ్యలో భక్తులు వీటిని అందుకునేందుకు పోటీపడ్డారు.

పర్యావరణహితం.. శ్రీసిటీ సొంతం

- పరిశ్రమలే కాదు పర్యావరణ పరిరక్షణ దిశగా అడుగులు వేస్తున్న శ్రీసిటీ
- పర్యావరణ సహితంగా పరిశ్రమల ఏర్పాటు
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

వరదయ్యపాళెం: శ్రీసిటీ.. భారీ పరిశ్రమలే కాదు.. అక్కడ వాతావరణం కూడా సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఇప్పటికే స్మార్ట్ సిటీ, గ్రీన్ సిటీగా పిలవబడుతున్న ఈ ఏకీకృత పారిశ్రామిక నగరం నేడు పర్యావరణహిత సిటీగా కూడా మారిందనడంలో అతిశయోక్తి లేదు. పర్యావరణ హిత చర్యల్లోనూ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. కాలుష్య నివారణతో పాటు పచ్చదనం, పరిశుభ్రత, నీటి సంరక్షణ ఇతర పలు పర్యావరణ ప్రమాణాల పెంపు కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. అవేంటో ఒక లుక్కేయండి.

సోలార్‌పవర్ : విద్యుత్‌శక్తి అవసరాలను తీర్చడానికి 10 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఇది ఆంధ్రప్రదేశ్‌లోని అతిపెద్ద సౌర విద్యుత్ ప్లాంట్లలో ఒకటి. కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో సహాయపడే స్వచ్ఛమైన విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. శ్రీసిటీ కార్యాలయాలకు, వీధి దీపాలకు, మరిన్ని అవసరాలకు దీన్ని వినియోగిస్తున్నారు.

వేస్ట్ మేనేజ్‌మెంట్ : శ్రీసిటీలో మురుగునీరు, ఇతర వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. మురుగునీటిని శుద్ధి చేసి చెట్ల పెంపకం, ఇతర అవసరాలకు వాడుతారు. చెత్తాచెదారం, బయోడిగ్రేడబుల్ వ్యర్థాలను శుద్ధి చేసి చెట్లకు ఎరువులుగా, మిగులు ఆహార పదార్థాలను బయో మెథనేషన్ యంత్రం ద్వారా వంట గ్యాస్‌గా తయారు చేసి స్థానిక అవసరాలకు వినియోగిస్తున్నారు. శ్రీసిటీలో, పరిసర ప్రాంతాల్లో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.


శ్రీసిటీలో మురుగునీరు శుద్ధి చేసే ప్లాంట్

నీటిసంరక్షణ : శ్రీసిటీలో నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా వర్షపునీరు నిల్వ చేసేందుకు కిలోమీటర్ల పొడవునా, కాలువలు, రిజర్వాయర్లు నిర్మించారు. నీటిని శుద్ధి చేసి పునర్వినియోగం చేస్తూ సమగ్ర నీటి సంరక్షణ చర్యలను అమలుచేస్తున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా ఇక్కడ నీటి వినియోగం తగ్గి భూగర్భస్థాయి పెరిగింది.

గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ : శ్రీసిటీ క్యాంపస్‌చుట్టూ గ్రీన్ బెల్ట్‌ను విస్తృతంగా అభివృద్ధి చేస్తున్నారు. దీని వలన స్వచ్ఛమైన గాలి అందుతూ ఆహ్లాదకరమైన వాతావరణం చోటుచేసుకుంది. ఇప్పటి వరకు 10 లక్షలకు పైగా చెట్లను నాటడం పూర్తి చేయగా మొత్తం 50 లక్షలచెట్లను నాటడం లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ఏటా ప ర్యావరణం దినోత్సవం సందర్భంగా శ్రీసిటీ పరిసరాలు పరిశ్రమల ఆవరణంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్ర మం నిర్వహిస్తారు. అలాగే శ్రీసిటీ తనఉద్యోగుల కోసం పబ్లి క్ ట్రాన్స్‌పోర్టు సైకిలింగ్ వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది.

సామాజిక బాధ్యత : సామాజిక బాధ్యతగా తమ ఉద్యోగులు, ఇతర పరిసర ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం పలు సామాజిక బాధ్యతల చర్యల అమలుకు శ్రీసిటీ కట్టుబడి ఉంది. ఈ ప్రాంతంలో విద్య, వైద్య సదుపాయాలను మెరుగుపరచడం.. స్థానిక వ్యాపారాలకు మద్దతు ఇవ్వడం, ఇతర కమ్యూనిటీ అభివృద్ధి కార్యకలాపాలకు పెద్దపీట వేస్తోంది. శ్రీసిటీ సుస్థిర పర్యావరణహిత కార్యక్రమాలు, ఇక్కడ వ్యాపార అనుకూల వాతావరణాన్ని మరింత ప్రోత్సహిస్తోంది. శ్రీసిటీలో వినూత్న వ్యర్థాల నిర్వహణ, వ్యవస్థలు, నీటి నిర్వహణ చర్యలు, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం, ఇతర పారిశ్రామిక పార్కులు అనుసరించడానికి ఇది ఒక్క చక్కని ఉదాహరణగా మారుతోంది. శ్రీసిటీ పర్యావరణ హిత చర్యలకు గుర్తింపుగా ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ)కి చెందిన ప్రతిష్టాత్మక గ్రీన్ సిటీ గోల్డ్ రేటింగ్ అవార్డు శ్రీసిటికీ తగ్గింది. అలాగే నీటి పొదుపు, సంరక్షణ చర్యలకు గాను 2021లో సీఐఐ నేషన్ వాటర్ అవార్డు శ్రీసిటీని వరించింది.


పచ్చదనంతో కనువిందు చేస్తున్న రోడ్డు


సోలార్ విద్యుత్ తయారీ ప్లాంట్


వర్షపునీరు నిల్వ చేసే జలాశయం


ఆర్గానిక్ వేస్ట్ నుంచి బయోగ్యాస్ తయారు చేసే ప్లాంట్


ఎలక్ట్రిక్ ఆటో



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,520
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,525
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76.00

అట్టహాసంగా మారథాన్


పోటీలను ప్రారంభిస్తున్న కలికి మాధవరెడ్డి, సుధీప్‌రెడ్డి తదితరులు

నాయుడుపేటటౌన్: నాయుడుపేట స్పోర్ట్స్ ఫౌండేషన్ (ఎన్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఆదివారం మారథాన్ పరుగు పందెం పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు ప్రాంతాలకు చెందిన సుమారు 500 మందికిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు. జాతీయ పారా అథ్లెట్ మోమిడి లక్ష్మయ్య, కమిటీ సభ్యుల సారథ్యంలో10, 14,18 ఏళ్ల వయస్సు కలిగిన పిల్లలకు 3, 4, 5 కిలోమీటర్ల పరుగు పందేలను నిర్వహించారు. పోటీలను ఎన్‌డీసీసీబీ మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, సుధీప్‌రెడ్డి, సురేష్, డాక్టర్ చల్లా వినూప్‌కుమార్ ప్రారంభించారు.

ట్రక్కు ఢీకొని యువకుడి మృతి

చిల్లకూరు : మండలంలోని రామారెడ్డిపాళెం సమీపంలో ఆదివారం ట్రక్కు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. తూర్పుకనుపూరు గ్రామానికి చెందిన గుడి వెంకటేశ్వర్లు (22) బైక్‌పై గూడూరుకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న క్యాటరింగ్ ట్రక్కు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లును 108లో గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్వమోహనం.. విమానోత్సవం

– వేడుకగా కరిమాణిక్య స్వామి బ్రహ్మోత్సవాలు


ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న వేద పండితులు


ఊరేగుతున్న స్వామివారు

నాయుడుపేటటౌన్ : మండలంలోని తుమ్మూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామివారి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి విమానోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయ ప్రధానార్చకుడు శేషాద్రిస్వామి ఆధ్వర్యంలో టీటీడీ వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారి తిరుచ్చి ఉత్సవాన్ని జరిపించారు. మధ్యాహ్నం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం చేపట్టారు. రాత్రి ఊంజల్ సేవ, ఏకాంత సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరిరెడ్డి, గ్రామపెద్దలు కామిరెడ్డి రామకృష్ణారెడ్డి, కామిరెడ్డి మోహన్‌రెడ్డి, నరసారెడ్డి, పసల గంగాప్రసాద్, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం : బ్రహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో ఉదయం తిరుచ్చి ఉత్సవం, సాయంత్రం సింహ, గజవాహన సేవలు జరిపించనున్నట్లు వెల్లడించారు.

బంగారు చీరలో ముత్యాలమ్మ దర్శనం



చిల్లకూరు: మండల తీర ప్రాంతంలోని తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారు ఆదివారం బంగారు చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మూలవిరాట్‌కు బంగారు చీరను అలంకరించారు. పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారికి బంగారు చీరను అలంకరించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ ఇంద్రసేనమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చెంగాళమ్మ ఆలయంలో అఖండజ్యోతి


అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం


కాళంగినదిలో బోట్‌షికార్ చేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు

సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అఖండజ్యోతిని వెలిగించారు. ముందుగా అఖండజ్యోతికి వేదపండితులు వేద మంత్రోచ్చారణలతో పూజలు చేశారు. అనంతరం ఆలయంలోని పరివార దేవతలకు చూపించి హారతులిచ్చారు. ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, పాలకమండలి సభ్యులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఎం పద్మజ, బీ.సునీత, ఎన్. నాగమణి, పీ.మారెమ్మ పాల్గొన్నారు.

ఘనంగా చండీయాగం : అమ్మవారి ఆలయం ఆవరణంలోని యాగశాలలో జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా మహాచండీయాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాయుడుపేటకు చెందిన ఓడూరు మునికృష్ణారెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

చెంగాళమ్మ సేవలో ఏపీ జుడిషియల్ అకాడమీ డైరెక్టర్ : ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ శ్రీహరిహరనాథశర్మ చెంగాళమ్మ ఆలయానికి విచ్చేయగా.. చైర్మన్ బాలచంద్రారెడ్డి, ఈఓ శ్రీనివాసులురెడ్డి సాదరంగా స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనాలతో ఆలయ మ ర్యాదలతో ఆయన్ను ఘనంగా సత్కరించారు.

తెప్పోత్సవ బోట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కిలివేటి

అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా కాళంగినదిలో బోట్‌షికార్‌ను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆలయ చైర్మన్ ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. భక్తులకు కాసేపు సేద తీరడానికి ప్రత్యేకంగా కాళంగినదిలో బోట్ షికార్ ఏర్పాటు చేశారు. ఈ బోట్లను లాంఛనంగా ప్రారంభించిన నేతలు, అధికారులు కాసేపు బోట్ షికార్ చేశారు.

శాస్త్రోక్తం.. జ్యేష్ఠాభిషేకం


స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


తిరుచ్చిపై దేవదేవేరులు

- పెనుశిల నృసింహునికి ప్రత్యేక పూజలు
- వైభవంగా తిరుచ్చి ఉత్సవం

రాపూరు : పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం శాస్త్రోక్తంగా జ్యేష్ఠాభిషేకం నిర్వహించారు. ఈ క్రమంలో వేకువ జామునే స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి విశేష అభిషేకాలు చేసి, నిత్య కైంకర్యాలు సమర్పించారు. పూలంగి సేవ, నరసింహ హోమం జరిపించారు. అనంతరం నిత్య కల్యాణమండపంలో స్నపన పీఠంపై ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేతంగా నరసింహస్వామిని కొలువుదీర్చారు. పుణ్యజలాలలో జ్యేష్ఠాభిషేకం నిర్వహించారు.

వైభవంగా క్షేత్రోత్సవం

స్వామి, అమ్మవార్లకు రాత్రి వైభవంగా తిరుచ్చి ఉత్సవం జరిపించారు. సుగంధ సుమాలు, సువర్ణ ఆభరణాలతో అలంకరించిన ఉత్సవమూర్తులను తిరుచ్చిలో కొలువుదీర్చి మంగళవాయిద్యాల నడుమ మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

గరుడునిపై గోవిందుని విహారం


మోహినీ అవతారంలో శ్రీవారు


గరుడవాహనంపై కల్యాణ వెంకటేశరస్వామి

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కనులపండువగా గరుడసేవ నిర్వహించారు. ఈ క్రమంలో ముందుగా వేకువజామునే శ్రీవారిని సుప్రభాతంతో అర్చకులు మేల్కొలిపారు. నిత్యపూజాకైంకర్యాలను సమర్పించారు. అనంతరం సర్వాలంకారభూషితుడైన శ్రీహరిని మోహిని అవతారంలో తీర్చిదిద్ది పల్లకిలో కొలువుదీర్చారు. భక్తుల గోవిందనామ స్మరణల నడుమ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం దేవదేవేరులకు స్నపన తిరుమంజనం చేపట్టారు. సుగంధ పరిమళాలు వెదజల్లే ద్రవ్యాలు, ధూప దీప నైవేద్యాలను అందుకుని సేద తీరారు. సాయంత్రం కల్యాణ వేంకటేశ్వరునికి శోభాయమానంగా ఊంజల్ సేవ జరిపించారు. రాత్రి 7.30 గంటలకు శ్రీవారు తనకు అత్యంత ప్రీతిపాత్రమైన గరుడ వాహనాన్ని అధిరోహించి మాడవీధుల్లో విహరించారు. పెద్దసంఖ్యలో భక్తులు వైకుంఠనాథుని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి 11 గంటలకు ఆలయానికి చేరుకున్న వేంకటేశునికి అర్చకులు శాస్త్రోక్తంగా ఏకాంత సేవ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకుడు శ్రీధరభట్టాచార్య, ఆర్జితం అధికారి భరత్, భద్రతా జమేదార్ రాజశేఖర్ పాల్గొన్నారు. సోమవారం ఉదయం హనుమంత వాహనసేవ, సాయంత్రం వసంతోత్సవం, రాత్రి గజవాహనసేవ నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

తెప్పోత్సవం..పరిపూర్ణం


గరుడ వాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. ఐదు రోజులుగా నిర్వహించిన ఈ వార్షిక తెప్పోత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఉదయం అమ్మవారి మూలవర్లకు అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం పుష్కరిణి మధ్యలోని నీరాడ మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం శ్రీ పద్మావతి అమ్మవారు తెప్పపై పుష్కరిణిలో ఏడు పర్యాయాలు విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు.

నేత్రపర్వంగా గరుడ సేవ

తెప్పోత్సవంలో చివరి రోజు తెప్పోత్సవం అనంతరం అమ్మవారిని గంగుండ్ర మండపానికి తీసుకొచ్చి అక్కడ సిద్ధంగా ఉంచిన గరుడ వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం దివ్యాలంకార శోభితురాలైన శ్రీవారి దేవేరి శ్రీ పద్మావతి అమ్మవారు గరుడ వాహనంపై ఆసీనులై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించారు. డెప్యూటీ ఈఓ గోవిందరాజన్, పేష్కార్ రమేష్, సూపరింటెండెంట్లు శేషగిరి, మధు, ఆర్జితం, వాహన ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, సుభాష్ పాల్గొన్నారు. సోమవారం నుంచి ఆర్జిత సేవలు పునఃప్రారంభంకానున్నట్లు డెప్యూటీ ఈవో గోవిందరాజన్ తెలిపారు.